మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

3.4.2026 శుక్రవారం Friday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 343 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## కోల్‌కతాపై రైజర్స్ విజయం



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

అభినందనలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# ఫ్యూచర్ సిటీ అదిరిపోవాలి

## అద్భుతంగా నిర్మాణాలు

### ప్రతి నిర్మాణానికీ ఓ ప్రత్యేకత

### ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించాలి

అత్యాధునిక పరిజ్ఞానం, వందేళ్ల ముందుచూపు ఉట్టిపడాలి

## అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి

## ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పరిశీలన



**జనతా న్యూస్, హైదరాబాద్ :** ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీ లించారు. ఫ్యూచర్ సిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలిస్తూ.. అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గురువారం కేరళం పర్యటన ముగించుకుని వచ్చిన ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ

మిగతా 2 లో

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

## కేసీఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం

ఏటీఎంలా ప్రాజెక్ట్ వాడుకున్న కేసీఆర్

ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కేసీఆర్

అవినీతిపై కేసీఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్

రాజ్యసభలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ సురేశ్ రెడ్డి



రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు.



# పార్లమెంట్ సాక్షిగా అబద్ధాలు

## ఏడు మండలాల అప్పగింత బీజేపీ పుణ్యమే

## వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు.

## కమిషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై కేటీఆర్ విమర్శలు

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

## అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?

## కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత



కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

## పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక

## మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

వివరాలు 2 లో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు.





# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

## అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

.. వివరాలు 2లో



# రాతియుగంలోకి ఇరాన్

## అలా దెబ్బకొడతాం.. ఇక కోలుకోలేదు

## రెండు, మూడు వారాల్లో భీకర దాడులు

## మా లక్ష్యాలు పూర్తికావచ్చాయి

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వివరాలు 4 లో

ఇరాన్లో లక్ష్యాలు పూర్తి కావస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జె ట్రంప్ అన్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా అమెరికా సైన్యం ఇరాన్లో తన కార్యాచరణ లక్ష్యాలను పూర్తి చేసే దశకు చేరుకుందని తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం వైట్ హౌస్ నుండి ప్రసంగిస్తూ రాబోయే రెండు, మూడు వారాల్లో ఇరాన్లో అమెరికా తన కార్యకలాపాలను తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు.

# మీవి హాలీవుడ్ భ్రమలు

## మాది 6వేల ఏళ్ల నాగరికత

## మీది 250 ఏళ్ల చరిత్ర

## మమ్మల్నే హెచ్చరిస్తారా?

సమాధుల్లోకి మీ సైనికులను పంపుతున్నారు

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ మండిపాటు

# చికెన్ షాపులకు 40 మార్జిన్ ఇస్తున్నాం

## కొందురు కావాలనే తప్పదోవ పట్టిస్తున్నారు

## బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ వెల్లడి

.. వివరాలు 2లో



# నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

## పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక.. మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**రంగారెడ్డి,ఏప్రిల్2 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ పక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు. .తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం అన్నారు.

# భూభారతి పోర్టల్ ఆవిష్కరణ

## అక్రమాలకు ఇక చెక్ : పొంగులేటి

**రంగారెడ్డి,ఏప్రిల్2 :** రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా ప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

## అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

# చికెన్ షాపులకు 40 మార్జిన్ ఇస్తున్నాం

## కొందురు కావాలనే తప్పదోవ పట్టిస్తున్నారు

## బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్2 :** చికెన్ రేటు మార్జిన్ విషయంలో చికెన్ రిటైల్ షాపు వ్యాపారులు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ తెలిపింది. రిటైల్ షాపుల ఆరోపణలపై హైదరాబాద్ సోమాజిగూడాలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు రామిరెడ్డి , బాలసుబ్రహ్మణ్యన్ , రాజిరెడ్డి లు మాట్లాడారు. చికెన్ లైవ్ రేట్ తో పాటు రిటైల్ ధరలను పేపర్ ద్వారా ప్రకటనలు ఇస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా కిలోకు 40 రూపాయలు మార్జిన్ ఇస్తున్నామని , కరోనా సమయంలో కూడా అంతే ఇచ్చామని తెలిపారు. బంద్ లో ఉన్న వ్యాపారులు కిలోకు 30 రూపాయలు అడుగుతున్నారని... తాము 40 ఇస్తున్నామన్నారు. కొందరు కావాలనే వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కంపెనీలు నష్టాల్లో ఉన్నా కస్టమర్ పై భారం పడకుండా రేటును నిర్ణయిస్తున్నామని తెలిపారు. రిటైల్ వ్యాపారులతో తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, వారికి వస్తున్న మార్జిన్ పై వివరించి చెబుతామని అన్నారు. మరోవైపు చికెన్ పై మార్జిన్ పెంచి, న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ చేస్తున్న బంద్ రెండో రోజుకు చేరుకుంది. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రకటిస్తున్న రిటైల్ అసోసియేష్ సభ్యులు.. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ పెంచేవరకూ నిరవధిక బంద్పాటిస్తామని హెచ్చరించింది. చికెన్ పై మార్జిన్ ఇవ్వకపోవడం పౌల్ట్రీ కంపెనీల తీరుకు నిరసనగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, గోపి, యాదగిరి, వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల 26 శాతం ఉన్న మార్జిన్ ను పౌల్ట్రీ కంపెనీలు16 శాతానికి తగ్గించాయని, దీనివల్ల చికెన్ షాపుల నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# ఫ్యూచర్ సిటీ అదిరిపోవాలి

మొదటి పేజీ తరువాయి

నిర్మాణాలను సుమారు గంటపాటు స్వయంగా తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా తనతోపాటు ఉన్న అధికారులతో మాట్లాడుతూ.. "ప్రతి నిర్మాణానికి ఓ ప్రత్యేకత. తెలంగాణ "భారత్ ఫ్యూచర్ సిటీ' అంటేనే అదరాలి, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించాలి.. ఆదర్శంగా నిలవాలి" అని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు నెలవుగా మారనున్న ఈ ప్రాంతంలో ఏ ప్రతినిధి బృందం పర్యటిం చినా, ముందుగా చూసేది ఎఫ్ఎసీఏ కార్యాలయమేనని చెప్పారు. ఈ కార్యాలయ ప్రాంగణంలోని అడుగు పెడితే, భవిష్యత్ అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపించేలా అత్యాధునిక పరిజ్ఞానం, వందేళ్ల ముందుచూపు ఉట్టిపడాలని సీఎం ఆకాం క్షించారు. ప్రతి అంగుళం ఓ ప్రత్యేకతను చాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా మీరాఖాన్పేట్లో 20 ఎకరాల్లో రు.19 కోట్లతో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎఫ్సిడిఏ) కార్యాలయానికి గతేడాది సెప్టెంబర్లో సీఎం రేవంత్ రెడ్డి పునాది రాయి వేసిన విషయం తెలిసిందే. జీవ విజ్ఞాన రంగానికి సంబంధించి హైదరాబాద్లో పెట్టుబడులు, కంపెనీలు పెట్టాలని యోచించే గ్లోబల్ ఇన్వెస్టర్లకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఇప్పటికే ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్లో జీసీసీ (గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఈ విషయమై మరింత లోతుగా దృష్టి సారించడానికి, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఇన్నోవేషన్ సెంటర్లను సాధించాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో జీసీసీల కోసం ఒక సెంటర్లను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి ప్రత్యేక జోన్ ను నిర్మించాలని ప్రతిపాదించారు.

ఫ్యూచర్ సిటీలో ప్రకటించిన పెట్టుబడుల వివరాలు



ఫ్రాన్స్లో తన ప్రపంచ ప్రధాన కార్యాలయంతో సనోఫీ నుంచి విడిపోయిన గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్కేర్ కంపెనీ ఒపెల్లా హెల్త్కేర్, దాని జీసీసీ కార్యకలాపాలను 42,000 చదరపు అడుగుల సౌకర్యంతో భారత్ ఫ్యూచర్ సిటీలో విస్తరిస్తోంది. వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను ఈ కంపెనీ లను సృష్టించనుంది. జీఏపీఎఫ్ఏ ఇండోనేషియా విభాగమైన వాక్సిండో యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, నోమ్ వ్యాలీలో అత్యాధునిక బీఎస్ఎల్-3 వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, స్వైన్. ఆక్వాకల్చర్ కోసం వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతుంది ఏఐ, డేటా సైన్స్ కంపెనీగా పేరొందిన ట్రె డెన్స్ ఐఎన్సీ, ఏఐ-ఆధారిత హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ పై కీలక సేవలు అందించిన సంస్థ తన హైదరాబాద్ కార్యకలాపాలను నిర్వహించాలని ప్రకటించింది. ఈ కేంద్రం సుమారు 18వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండగా దీనిలో ప్రపంచస్థాయి కార్యకలాపాలను నిర్వహించతలపెడుతోంది. దీంతో ఏఐ ఆధారిత హెల్త్ కేర్ రంగంలో మరింత అత్యాధునికత రానుంది. భారత దేశ లైఫ్ సైన్సెస్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ హైదరాబాద్లోని జీనోమ్ వ్యాలీలో 'భారీస్థాయిలో భారీస్థాయిలో ఫార్మాట్ లైఫ్ సైన్సెస్ క్యాంపస్ను అభివృద్ధి చేస్తోం చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 12 ఎకరాల స్థలంలో విస్తరించి విస్తరించి ఉ ఉన్న మిలియన్ మిలియన్ చదరపు అడుగుల అడ్వాన్డ్ అడ్వాన్డ్ ల్యాబ్, మౌలిక సదుపాయాలను కలిగి ఉంటుంది. ఇది రాబోయే ఆరు సంవత్సరాలలో మరింత విస్తృతం కానున్నదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు వివరించారు.

# సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

## 2047 విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకెళుతున్న సిఎం

## తుమ్మలూరు గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

**రంగారెడ్డి,ఏప్రిల్2 :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభ ముఖ్య ఉద్దేశం అని సి.ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని సి.ఎస్ అన్నారు. కళ్యాణ్ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.

# కాంగ్రెస్ నేత కాటా అరెస్ట్

## గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత

**సంగారెడ్డి,ఏప్రిల్2 :** ఆర్సీ పురంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని.. తడి బట్టలతో గుడిలో ప్రమాణం చేస్తానని కాంగ్రెస్ నేత తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉదయం బీరంగూడ శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి వాహనంలో బయలుదేరారు కాటా శ్రీనివాస్. ఇంటి బయటే పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శివాలయం వద్దకు వెళ్లే తీరుతానని కాటా శ్రీనివాస్ పట్టుబట్టారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన కుటుంబ సభ్యులను గుడికి అనుమతించాలని పోలీసులను శ్రీనివాస్ కోరారు. చివరకు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హైదరాబాద్ వైపు తరలించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు, కాటా శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే ప్రత్యారోపణలు చేయడంతో వార్ మొదలైంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిజమైతే శివాలయంలో తడి బట్టలతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానని, గుడిలో తడి బట్టలతో ప్రమాణం చేస్తానని కాటా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సవాల్‌పై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంకా స్పందించలేదు.

# సంపులో పడి చిన్నారి మృతి

**హైదరాబాద్,ఏప్రిల్ 2 :** నార్సింగిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గండిపేటలో ఎనిమిది నెలల పసికందు సంపులో పడి మృతి చెందింది. ఆడుకుంటూ ఇంటి బయటికి వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు సంపు దగ్గరకు వెళ్లేలోపే నీటిలో మునిగిపోయింది. సంపులో నుంచి చిన్నారిని బయటకు తీసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీగా విలపించారు. పొట్ట చేత పట్టుకుని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు.. గండిపేటలో జీవనం సాగిస్తున్నారు. అప్పటి వరకు ఆడుకుంటున్న తమ చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# పెళ్లి చేసుకున్న నెలకే నవ వధువు ఆత్మహత్య

## కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్,ఏప్రిల్2 :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవవధువు ఆత్మహత్య కలకలం రేపుతోంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెల రోజులకే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది. 2020లో సోషల్ మీడియా ద్వారా బీహార్‌కు చెందిన ఇషికా యాదవ్, మధ్యప్రదేశ్‌కు చెందిన నీరాజ్ బన్సల్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఫిబ్రవరి 20న పెద్దల సమక్షంలో ఇరువురూ వివాహం చేసుకున్నారు. మియాపూర్‌లోని మక్త మహబూబ్‌పేట్‌లోనీ ఓ అపార్ట్‌మెంట్‌లో ఇషిక, నీరజ్ నివాసముంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ భార్యాభర్తలు ఇద్దరూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా అదనపు కట్నం విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. భర్త వేధింపులు తట్టుకోలేక తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఇషిక ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇచ్చిన సమాచారంతో మియాపూర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# క్యాటరింగ్ పేరుతో దగుల్బాజీ పనులు

## ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్2 :** చేసేది క్యాటరింగ్ పనే ఐనా..చాటుమాటుగా కంత్రీ పనులు చేస్తున్నాడో కేటుగాడు. ఫంక్షన్లకు క్యాటరింగ్ ఫుడ్ సప్లై చేస్తూ.. ముందుగా మాట్లాడుకున్న దాని కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఎందుకుని ప్రశ్నిస్తే ఫంక్షన్లో దొంగచాటుగా మహిళల ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి వేధిస్తున్నాడు. సికింద్రాబాద్ అడ్డాగా క్యాటరింగ్ చాటున కంత్రీ పనులకు పాల్పడుతున్న కేటుగాడిని పోలీసులు పట్టుకున్నారు . సికింద్రాబాద్ పరిధిలోని మోండా మార్కెట్‌కి చెందిన వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్ స్థానికంగా క్యాటరింగ్ బిజినెస్ చేస్తున్నాడు. మీటింగ్‌లు, ఫంక్షన్లకు ఫుడ్ సప్లై చేయడమే కాకుండా, వడ్డించేందుకు క్యాటరింగ్ బాయ్స్‌ను కూడా సప్లై చేస్తుంటాడు. మోండా మార్కెట్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి తన ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్ కోసం అంజి కిరణ్ వద్ద క్యాటరింగ్ ఆర్డర్ ఇచ్చాడు. ఆర్డర్ బుకింగ్ సమయంలోనే ప్లేట్ భోజనానికి ఎంత ఛార్జ్ అవుతుంది? ఎన్ని ప్లేట్లు తెస్తారు? ఎంతమంది క్యాటరింగ్ బాయ్స్ వస్తారు? వాళ్లకు ఎంత ఇవ్వాలి? అనేది మాట్లాడుకున్నారు. తీరా ఫంక్షన్ ముగిసిన తర్వాత అంజి కిరణ్ అదనంగా బిల్లు వేశాడు. ఏవేవో ఛార్జీల పేరుతో అదనంగా డబ్బులు డిమాండ్ చేశాడు. ఎందుకు ఇవ్వాలి అని అడిగితే గొడవ పెట్టుకున్నాడు. అసభ్యంగా దూషించాడు. ఫంక్షన్ జరుగుతున్న సమయంలో ఫంక్షన్‌కి అటెండ్ అయిన మహిళల ఫొటోలు తీశానని? వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిలింగ్‌కి దిగాడు. దీంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. అంజి కిరణ్‌పై ఫిర్యాదు చేశారు. వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పోలీసులు. ఇదే తరహాలో పలుచోట్ల బెదిరింపులకు, వేధింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు దిగినట్లు గుర్తించారు పోలీసులు. గతంలో ఇలాంటివే రెండు కేసులు కూడా నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. అంజి కిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పార్లమెంట్ సాక్షిగా అబద్దాలు

**ఏడు మండలాల అప్పగింత బీజేపీ పుణ్యమే**

**వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి**

**మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**



**హైదరాబాద్,ఏప్రిల్2 :** తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్‌లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్దమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్దమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్దమా? ఏది అబద్దం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు. క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యనించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని, దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే ' అని వెల్లడించడం మీ కళ్ళకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీష్‌రావు విమరించారు. 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని రిప్రెజెంట్ చేయకుండా సప్రెస్ చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

**పార్టీ శ్రేణులకు హరీష్ రావు పిలుపు**

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసింది. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతలకు పెన్షన్లు పెంచకుండా, కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసింది. ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మీలాంటి యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి

మోసాన్ని సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**పంచాయితీ నిధుల విడుదలే సాక్ష్యం : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,ఏప్రిల్2 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(÷ూఆఒ)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.తాజాగా 2025-26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026-27 నుంచి 2030-31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటూ ప్రకటన జారీ చేశారు.

# కమీషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

**ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై కేటీఆర్ విమర్శలు**

**హైదరాబాద్,ఏప్రిల్2 :** ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలనా..అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. టెస్కోకు విద్యాశాఖ షాక్ అని ఓ ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఎక్స్‌లో కేటీఆర్ ట్యాగ్ చేస్తూ రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చి చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతుందని.. ఇది ప్రజా ప్రభుత్వమా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా..? అని మండిపడ్డారు. రూ. 105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ. 200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి..? అని అడిగారు.కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా

కమీషన్లు దండుకోవాలనే యావలో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తున్నదని ధ్వజమెత్తారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

**అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత**



**హైదరాబాద్,ఏప్రిల్2 :** కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

# అమరావతికి మా సంపూర్ణ మద్దతు

**కాళేశ్వరం ప్రాజెక్టుకు పైసా ఇవ్వకున్నా కట్టాం**

**తెలంగాణకు 12 ఏళ్లుగా సాయం చేయని కేంద్రం**

**రాజ్యసభలో వద్దిరాజు, కెఆర్ సురేశ్ రెడ్డి**

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): రాజధాని అమరావతికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. అమరావతి బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు రుణాలతో కాళేశ్వరం కట్టామని వివరించారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా కాళేశ్వరం నిర్మించామని చెప్పుకొచ్చారు. కాలేశ్వరంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ.. అమరావతికి గతంలోనే కేసీఆర్ మద్దతు తెలిపారన్నారు. అమరుల త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలబెట్టామన్నారు. ప్రాంతాల వారీగా వేరైనా అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారని వెల్లడించారు. కనీసం చర్చ లేకుండా 7 మండలాలను ఏపీలో కలిపారని.. విభజన తీరుపై బీజేపీ తరచూ విమర్శలు చేస్తోందని అన్నారు. తల్లిని చంపి బిడ్డను తీశారన్నట్లు మాట్లాడారని సురేశ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం అంటే ఒక డ్యాం.. ప్రాజెక్ట్ మాత్రమే కాదని ఎంపీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని తెలిపారు. పైసా ఇవ్వకపోయినా కాళేశ్వరం కట్టామన్నారు. అయినా కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ రూ.లక్ష కోట్లు పోయాయని మాట్లాడారని చెప్పారు. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని.. తెలంగాణ ప్రజలకు కేంద్ర మంత్రి పాటిల్ క్షమాపణ చెప్పాలని ఎంపీ సురేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో కూలిన రెండు పిల్లర్లను 300 కోట్లతో బాగు చేయవచ్చన్నారు. కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

**కేసీఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం**

**ఏటీఎంలా ప్రాజెక్ట్ వాడుకున్న కేసీఆర్**

**ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కేసీఆర్**

**అవినీతిపై కేసీఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్**

**రాజ్యసభలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ సురేశ్ రెడ్డి**



**న్యూఢిల్లీ,ఏప్రిల్2 :** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాలేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాలేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాలేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

# దోమతెర కప్పుకుని ఎమ్మెల్యే నిరసన

**హైదరాబాద్,ఏప్రిల్2 :** నగరంలో దోమల సమస్యను ప్రభుత్వానికి తెలియచేసేందుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్నంగా రంగంలోకి దిగారు. దోమల బాధకు వ్యతిరేకంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దోమ తెర ధరించి, ఫాగింగ్ యంత్రంతో అసెంబ్లీ వద్దకు వచ్చారు. అనుమతి లేదని ఎమ్మెల్యేను మార్షల్స్ అడ్డుకున్నారు. ఆయన వద్ద నుంచి దోమ తెర లాక్కునేందుకు యత్నించారు. దీంతో మార్షల్స్‌పై సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరగని సమయంలో కొత్త నిబంధనలు ఎక్కడివని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ దోమల తీవ్రతకు ప్రజలు హైదరాబాద్ నుంచి పారిపోతున్నారని వ్యాఖ్యానించారు. దీనివల్ల నగరం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని చెప్పారు. దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.



# రాఘవ్ చద్దా డిమోట్

## రాజ్యసభ పార్టీ ఉపనాయకుడి పదవి నుండి తొలగించిన ఆమ్ ఆద్మీ

## ఆయన స్ధానంలో అశోక్ మిట్టల్ నియామకం



**న్యూఢిల్లీ:** అరవింద్ కేజ్రివాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాజ్యసభలో పార్టీ ఉపనాయకుడి పదవి నుండి రాఘవ్ చద్దాను తొలగించి, ఆయన స్థానంలో పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్ను నియమించింది. పార్లమె ంటులో మాట్లాడటానికి రాఘవ్ చద్దాకు సమయం కేటాయించకూడదని రాజ్యసభ సెక్రటేరియట్కు తెలియజేసినట్లు ఆప్ పార్టీ వర్గాలు గురువారం తెలిపాయి. రాఘవ్ చద్దా సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం పార్లమెంటులో ఆయనను మౌనంగా ఉంచాలని పార్టీ కోరుకుంటోంది. ఆయనకు మాట్లాడటానికి సమయం కేటాయించవద్దని పార్టీ పార్లమెంటుకు తెలియజేసింది. ఆయన స్వయంగా మాట్లాడటానికి సమయం కేటాయించు కోకుండా ఉండేలా చేయడానికే ఆయనను ఉపనాయకుడి పదవి నుండి తొలగించారు అని ఆ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు ఎగువ సభలో ఆప్ డిప్యూటీ లీడర్ గా చద్దా స్థానంలోకి వచ్చిన అశోక్ మిట్టల్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ ఛాన్సలర్ గా ఉన్నారు. ఎంపీ సంజయ్ సింగ్ సభలో ఆప్ పార్టీ నాయకుడిగా ఉన్నారు. రాజ్యసభలో అప్కు ప్రస్తుతం 10 మంది సభ్యులు ఉన్నారు. పంజాబ్ నుండి ఏడుగురు, ఢిల్లీ నుండి ముగ్గురు ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ల తరువాత సభలో ఈ పార్టీ నాలుగవ అతిపెద్ద పార్టీగా ఉంది. పార్టీలో చద్దా భవిష్యత్తుపై చర్చ ఒకప్పుడు ఆప్ అగ్రశ్రేణి నాయకుడిగా, కేజ్రివాల్ ఆంతరంగిక వర్గంలో ఒక "డిగా పరిగణించబడిన చద్దాకు పార్టీలో స్థానంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ముప్పై ఏడు సంవత్సరాల చద్దా ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో భాగంగా ఉన్నారు. ఢిల్లీలోని మోడరన్ స్కూల్ పూర్వ విద్యార్థి అయిన ఆయన ఒక చార్టర్డ్ అకౌంట్. 28 సంవత్సరాల వయసులో పార్టీలో చేరిన ఆయన ఢిల్లీ లోక్పాల్ బిల్లు ముసాయిదాను రూపొందించడంలో కీలకపాత్ర పోషించారు. ఆప్ జాతీయ అధికార ప్రతినిధిగా చద్దా ఆ పార్టీలో కీలక వ్యక్తిగా మారారు. 26 సంవత్సరాల వయసులో ఆ పార్టీ జాతీయ కోశాధికారిగా నియమితులయ్యారు. 2020 ఢిల్లీ ఎన్నికలలో చద్దా రాజేంద్రనగర్ స్థానం నుండి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2022లో రాజ్యసభఅభ్యర్థిగా ఎన్నికయ్యారు. చద్దా హోదాను తగ్గించడం వెనుక గల కారణాన్ని ఆప్ అధికారికంగా వెల్లడించనప్పటికీ, పార్టీలో ఆయన స్థానంపై కొన్ని నెలలుగా చర్చ జరుగుతోంది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, ఢిల్లీ లిక్కర్ స్కామ్లో కేజీవాల్, ఆప్ నాయకుడు మనీష్ సిసోసిడియాలకు కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పుడు ఆయన మౌనంగా ఉండటం పార్టీ వర్గాలలో ఊహాగానాలకు దారితీసింది. అయితే విమానాశ్రయాల్లో ఆహారాల ధరలు అధికంగా ఉండటం, గిగ వర్కర్ల హక్కులు, ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ రద్దీ వంటి కీలక సమస్యలను చద్దా రాజ్యసభలో లేవనెత్తుతున్నారు. రాజ్యసభలో పార్టీ ఉపనాయకుడిగా బాధ్యతలు అప్పగించినందుకు అశోక్ మిట్టల్ కేజ్రివాల్కు ధన్యవాదాలు తెలిపారు..

# హార్మూజ్ ను బలవంతంగా తెరిపించలేం

## ట్రంప్పై ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తీవ్ర వ్యాఖ్యలు

సియోల్: నాటో కూటమి పట్ల తన నిబద్ధతపై ప్రతిరోజూ సందేహాలు రేకెత్తించడం ద్వారా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటోను బలహీనపరుస్తు న్నారని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ విమర్శించారు. మీ నిబద్ధతమపై మీరు ప్రతి రోజూ సందేహాలు రేకెత్తిస్తే, దానిని మీరే నిర్వీర్యం చేస్తారు అని దక్షిణ కొరియా రాజధాని సియోల్లో జరిగిన అధికారిక పర్యటన సందర్భంగా మాక్రాన్ వ్యాఖ్యానించారు. హార్మూజ్ జలసంధిని విముక్తి చేయడానికి సైనిక చర్య చేప ట్టడం వాస్తవ విరుద్ధమని అన్నారు

# ఇరాన్ నుండి 1200 మంది భారతీయుల తరలింపు

## విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి

## ఆర్మేనియా, అజర్బైజాన్ల గుండా ఇండియాకు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘ ర్షణల నేపథ్యంలో 1200 మందికి పైగా భారత పౌరు లను ఇరాన్ నుండి సురక్షితంగా తరలించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిసింది. న్యూఢిల్లీలో గురువారం జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖల సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి జైస్వాల్ మాట్లాడుతూ, ఈ తరలింపు ప్రక్రియ ఆర్మేనియా, అజర్బైజాన్ల ద్వారా జరుగుతోందని, క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వం సమన్వయం చేస్తోందని తెలిపారు. సుమారు 1200 మంది భారత పౌరులను తరలించారు. వీరిలో 845 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 996 మందిని ఆర్మేనియాకు, 204 మందిని అజర్బైజాన్కు తరలించినట్లు తెలిపారు. అక్కడి నుండి వారికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయం అందిస్తుందని అన్నారు. వారిని సురక్షితంగా తరలించడానికి, ఆర్మేనియా, అజర్బైజాన్లలోని భారతరాయ బార కార్యాలయాలు, స్థానిక అధికారులతో సమ స్వయం చేస్తోందని జైస్వాల్ అన్నారు. వారిని భారత దేశానికి తిరిగి తీసుకు వచ్చేముందు, మార్గమధ్యంలో వారికి సహాయపడటానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితులలో ఇప్పటి వరకు 6 లక్షల మందికి పైగా భారతీ-యులు పశ్చిమా సియా నుండి స్వదేశానికి తిరిగి వచ్చారు.

# మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ :** పసిడి ప్రియులకు శుభవార్త. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందుతున్న తరుణంలో మగువలకు తీపికబురు. నిన్నటి రోజున భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా తగ్గాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో భారీ ఊరట లభించింది. తులం గోల్డ్పై రూ.1,530 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. తులం గోల్డ్పై రూ.1,530 తగ్గడంతో బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గడంతో రూ.1,38,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,440 తగ్గడంతో రూ.1,13,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా భారీ దిగొచ్చింది. గురువారం కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,55,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది.

# రాతియుగంలోకి ఇరాన్

## అలా దెబ్బకొడతాం.. ఇక కోలుకోలేదు

## రెండు,మూడు వారాల్లో భీకర దాడులు

## మా లక్ష్యాలు పూర్తికావచ్చాయి

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్:** ఇరాన్లో లక్ష్యాలు పూర్తి కావస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జె ట్రంప్ అన్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా అమెరికా సైన్యం ఇరాన్లో తన కార్యాచరణ లక్ష్యాలను పూర్తి చేసే దశకు చేరుకుందని తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం వైట్ హౌస్ నుండి ప్రసంగిస్తూ రాబోయే రెండు, మూడు వారాల్లో ఇరాన్లో అమెరికా తన కార్యకలా పాలను తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. తద్వారా ఆ దేశం ఇతర దేశాలపై దాడులు చేయకుండా పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని అన్నారు. అలాగే ఆ దేశం ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకుండా నిరోధిస్తుందని ట్రంప్ అన్నారు. మా లక్ష్యాలు పూర్తిగా నెరవేరే వరకు యుద్ధాన్ని కొనసాగిస్తామని ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ప్రారంభం నుండే స్పష్టం చేస్తున్నానని చెప్పారు. అమెరికా తన అన్ని సైనిక లక్ష్యాలను త్వరలో, అతి త్వరలో పూర్తి చేసే మార్గంలో ఉందని, రాబోయే రెండు మూడు వారాల్లో మేము వారిపై అత్యంత తీవ్రంగా దాడి చేయబోతున్నాం. వారిని రాతి యుగానికి, అంటే వారికి తగిన చోటికి తిరిగి తీసుకెళ్తామని హెచ్చరించారు. అమెరికా ఫిబ్రవరి 28న ఇరాన్పై పోరాట చర్యలను ప్రారంభించింది. నిర్దిష్ట లక్ష్యాలలో ఇరాన్ దాడి క్షిపణులను, క్షిపణి ఉత్పత్తిని నాశనం చేయడం, ఇరాన్ నౌకాదళాన్ని, ఇతర భద్రతా మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం, ఇరాన్కు ఎప్పటికీ అణ్వాయుధాలు లేకుండా చూడటం ఉన్నాయని, అమెరికా సైన్యం ఒకదానితరువాత ఒకటిగా ఇరాన్ సైనిక సామర్థ్యాలను అత్యంత నైపుణ్యంతో నాశనం చేసిందని ట్రంప్ దేశ ప్రజలతో అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పుడు పూర్తిగా నాశనమైంది. వారి వైమానిక దళం అంతమైంది. వారి క్షిపణులు దాదాపుగా నాశనమయ్యాయి. క్షిపణి కార్యక్రమాన్ని మునుపెన్నడూ చూడని స్థాయిలో దెబ్బతీశాము వారి రక్షణ పారిశ్రామికస్థావరాన్ని పూర్తిగా తుడిచి పెట్టాము అని అన్నారు. ఈ చర్యలన్నీ కలిసి ఇరాన్ను సైనికంగా బలహీనపరిచాయని, ఉగ్రవాద ప్రాక్సీలకు మద్దతు ఇచ్చే దాని సామర్థ్యాన్ని అణచివేశామని అధ్యక్షుడు అన్నారు. యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకారం, కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్లో 12,300కు పైగా స్థావరాలపై దాడులు జరిగాయి. 13,000కు పైగా యుద్ధ విమానాలు ప్రయోగించబడ్డాయి. 155కు పైగా ఇరాన్ సైనిక నౌకలు దెబ్బతిన్నాయి. అమెరికా సైన్యం ఇరాన్ సామర్థ్యాన్ని అణచివేస్తోం దని, అయితే ఈ సంఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనిక సిబ్బందిని గుర్తుంచుకోవాలని ట్రంప్ అమెరికన్లను కోరారు. మన పిల్లలు ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగిన ఇరానన్ను ఎదుర్కోవలసిన అవసరం రాకుండా నిరోధించే ఈ పోరాటంలో తమ ప్రాణాలు అర్పించిన 13 మంది అమెరికన్ యోధులను ప్రత్యేకంగా స్మరించుకుంటున్నాము అని అధ్యక్షుడు అన్నారు. అమెరికన్ దళాలకు మద్దతు అందించినందుకు ఇజ్రాయేల్, సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రెయిన్తో సహా మధ్యప్రాచ్యంలోని మిత్రదేశాలకు ధన్యవాదాలు తెలిపారు. రెండవ ప్రపంచ యుద్ధం నాలుగేళ్లు, కొరియా యుద్ధం మూడేళ్లకు పైగా, వియత్నాం యుద్ధం దాదాపు 20 ఏళ్లు, ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్ ఎనిమిదేళ్లకు పైగా కొనసాగాయని గుర్తు చేశారు. అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒకదానిపై ఇంతటి శక్తివంతమైన, ఇంతటి అద్భుతమైన సైనిక చర్యను 32 రోజుల పాటు చేపట్టాము అని ఆయన అనినారు. ఆదేశం నిర్వీర్యమైపోయింది. వాస్తవానికి అది ఇకపై ఏ మాత్రం ప్రమాదకరం కాదని అన్నారు.

# మీవి హాలీవుడ్ భ్రమలు

## మాది 6వేల ఏళ్ల నాగరికత

## మీది 250 ఏళ్ల చరిత్ర

## మమ్మల్నే హెచ్చరిస్తారా?

## సమాధుల్లోకి మీ సైనికులను పంపుతున్నారు

## ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ మండిపాటు

టెహ్రాన్: ఇరాన్ను తిరిగి రాతి యుగానికి పంపేస్తామన్న అమెరికా బెదిరింపులను ఇరాన్ తిప్పికొట్టింది.

అమెరికాయే వారి సైనికులను తిరిగి సమాధుల్లోకి పంపుతోందని, 250 ఏళ్ల చరిత్ర మాత్రమే ఉన్న దేశం 6,000 సంవత్సరాల పురాతన నాగరికతను బెదిరించడంభ్రమ అనిపేర్కొంది. అమెరికా రక్షణ మంత్రిపీట్ హెగ్సెత్ చేసిన తిరిగి రాతి యుగానికి పంపడం అనే పోస్టుకు ఇరాన్ బ్రిగేడియర్ జనరల్ సయ్యద్ మజీద్ మూసావి సమాధానమిచ్చారు. ఆయన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్జీసీ) వాయు దళానికి కమాండర్గా ఉన్నారు. మీ సైనికులను సమాధులకు తీసుకెళ్తున్నది మీరే. మీరు రాతి యుగానికి లాగాలని చూస్తున్న ఇరాన్ కాదు. హాలీవుడ్ భ్రమలు మీ మనసులను విషపూరితం చేశాయి. మీ అల్పమైన 250 ఏళ్ల చరిత్రతతో 6,000 ఏళ్లకు పైబడిన నాగరికతను మీరు బెదిరిస్తున్నారు అనిమజీద్ మూసాని ఎక్స్ పోస్టో పీట్ హెగ్సెతీకుసమాధానమిచ్చారు. ఇరాన్ను తిరిగి రాతి యుగానికి పంపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించిన తరువాత హెగ్సో తన పోస్టో తిరిగి రాతి యుగానికి అంటూ పేర్కొన్నారు.

### ఇజ్రాయేల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు

టెహ్రాన్: ఇరాన్ శక్తి సామర్థ్యాలను పూర్తిగా నాశనం చేశామని ట్రంప్ పేర్కొన్న కొద్ది సేపటికే ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ వద్ద రహస్యంగా ఆయుధాలు. మందుగుండ సామగ్రి, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయని ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు గురువారం నొక్కిచెప్పారు. మీరు లక్ష్యంగా చేసుకున్నారని భావిస్తున్న కేంద్రాలు చాలా అల్పమైనవి అని లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జొల్ఫఘారి పేర్కొన్నారు. ఇరాన్ క్షిపణి దాడిని అడ్డుకోవడానికి వాయురక్షణ వ్యవస్థలు పని చేస్తుండగానే దుబాయిలో పేలుళ్లు వినిపించాయి. ట్రంప్ ప్రసంగం ముగిసిన అరగంట లోపే తమ వైపు వస్తున్న క్షిపణులను అడ్డుకోవడానికి తమ సైన్యం సన్నద్ధమవుతోందని ఇజ్రాయేల్ తెలిపింది. పోర్ట్ సిటీ హైఫాపై దాడులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా నావికాదళపు 5వ ఫీట్ కు నిలయమైన బహ్రెయిన్ లో సైరన్లు మోగాయి.

# హార్ముజ్ కోసం 35 దేశాల దౌత్యం

## 35 దేశాలతో ఆవిర్భావం

## యూకే చొరవ, భారత్ హాజరు

## ఏం సాధించడానికుందని యుద్ధం కొనసాగింపు : ఆస్ట్రేలియా



**న్యూఢిల్లీ:** హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించే ర దేశాల కూటమిలో భారతదేశం చేరింది. కీలక జలసంధిని తిరిగి తెరిచే మార్గా లను అన్వేషించేందుకు 35 దేశాలతో జరగనున్న సమావేశంలో పాల్గొనాలని బ్రిటన్ భారత్ను ఆహ్వానించిందని విదేశాంగ మంత్రి త్వ శాఖ గురువారం తెలిపింది. గురువారం రాత్రి జరగనున్న ఈ సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ విస్రి ఆన్లైన్ విధానం ద్వారా పాల్గొంటారని మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. హార్మూజ్ జలసంధిపై చర్చల కోసం బ్రిటన్ పలు దేశాలను ఆహ్వానించింది. ఇందులో భారత్ కూడా ఉందని జైస్వాల్ తెలిపారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి తరచుగా ట్రంప్ విమర్శలకు గురవుతున్న బ్రిటన్ ప్రధానమంత్రికీర్ స్టార్మర్ ఇటీవల మాట్లాడుతూ ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కెనాడా. యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రతను పునరుద్ధరించడంలో సహకరించడానికి అంగీకరిస్తూ ఒక ప్రకటనపై సంతకం చేశాయని తెలిపారు. నౌకాయన స్వేచ్ఛను పునరుద్ధరించడానికి, చిక్కుకుపో యిన నౌకలు, నావికుల భద్రతకు హామీ ఇవ్వడానికి, అలాగే అత్యవసర వస్తువుల రవాణాను తిరిగి ప్రారంభించడానికి మనం తీసుకోగలిగే అన్ని ఆచరణీయ దౌత్య, రాజకీయ చర్యలను ఈ సమావేశం సమీక్షిస్తుందని స్టార్మర్ తెలిపారు. ఆ సమావేశం ముగిసిన తరువాత, పోరాటాలు ఆగిపోయాక, మనం మన సామ ర్థ్యాలను సమీకరించి, ఆ జలసంధిని అందరికీ అందుబాటులోకి, సురక్షితంగా మార్చగలమో పరిశీలించడానికి సైనిక ప్రణాళికాక ర్తలతో కూడా మేము ఒక సమావేశం నిర్వహిస్తామని ప్రధాన మంత్రి అన్నారు. గురువారం జరిగే సమావేశానికి బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి ఇవెట్ కూపర్ అధ్యక్షత వహిస్తారు. దీని తరువాత వివరాలను ఖరారు చేయడానికి అధికారుల కార్యని ర్వాహక స్థాయి సమావేశాలు జరుగుతాయని రాయిటర్స్ నివేదిం చింది. గురువారం జరిగే వర్చువల్సమావేశం సాధ్యమయ్యే అన్నిదౌత్య, రాజకీయ చర్యలను అంచనా వేస్తుందని స్టార్మర్ తెలిపారు. ఈ జలమార్గాన్ని కాపాడటం తమ బాధ్యత కాదని డొనాల్డ్ ట్రంప్ పేరొన్న తరువాత జరుగుతున్న ఈ సమావేశానికి హాజరవుతున్న దేశాలలో అమెరికాలేదు. గురువారం నాటి సమావేశంలో పాల్గొం టున్న యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, కెనడా, జపాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు జలసంధిని అడ్డకునే ప్రయత్నాలను ఇరాన్ ఆపాలని డిమాండ్ చేస్తూనే, ఈ జలమార్గం రెండా సురక్షిత ప్రయాణానికి జరిగే ప్రయత్నాలకు సహకరిస్తావ ని ప్రతిజ్ఞ చేస్తూ ఒక ప్రకటనపై సంతకం చేశాయి. ఈ సమావేశాన్ని తొలి అడుగుగా పరిగణిస్తు న్నారు. దీని తరువాత వివరాలను ఖరారు చేయడానికి అధికారు లతో కార్యనిర్వాహక స్థాయి సమావేశాలు జరుగుతాయి. సానుకూల అంశం ఏమిటంటే ఇది ఒక విస్తృత కూటమి. ఇది కేవలం పాశ్చాత్య దేశాలు లేదా నాటో దేశాలది మాత్రమే కాదు. ఇందులో యూకే, ఫ్రాన్స్, స్కాండినేవియన్ దేశాలు, బాల్టిక్ దేశాలు మాత్రమే కాకుండా, బహ్రెయిన్, యూఏఈ, పనామా, నైజీరియా కూడా ఉన్నాయి. యూరప్ తన సొంత భద్రత కోసం మరింతగా కృషి చేస్తోందని ట్రంప్ ప్రభుత్వానికి తెలియజేయడం ఈ కూటమి ఏర్పాటు వెనుక ఉన్న కారణంగా చెబుతున్నారు. అమెరికా నాటో నుండి వైదొలగుతుందని బెదిరిస్తున్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది.

# కోల్‌కతాపై రైజర్స్ విజయం

## నితీశ్ ఆల్‌రౌండ్‌షో

## చెలరేగిన క్లాసెన్, అభిషేక్, హెడ్

## ఉనాద్కట్‌కు మూడు వికెట్లు



కోల్‌కతా: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జూలు విదిల్చింది. లీగ్‌ను ఓటమితో ఆరంభించిన ఈ జట్టు గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రం తమ పవరేంటో చాటుకుంది. బ్యాటింగ్‌లో బెంబేలెత్తించడంతో పాటు బౌలింగ్‌లోనూ ప్రత్యర్థిని వణికించింది. దీంతో ఇషాన్ కిషన్ సేన 65 పరుగుల భారీ తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 226 పరుగులు చేసింది. క్లాసెన్ (35 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 52), అభిషేక్ (21 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 48), హెడ్ (21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 46), నితీశ్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 39) రాణించారు. ముజరబానికి నాలుగు, వైభవ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకు కుప్పకూలింది. రఘువంశీ (29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 52), రింకూ (25 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 35), ఆలెన్ (7 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 28) ఫర్వాలేదనిపించారు. ఉనాద్కట్‌కు మూడు.. మలింగ, నితీశ్ కుమార్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నితీశ్ నిలిచాడు.

### పేసర్ల కట్టడి

భారీ ఛేదనలో కోల్‌కతా ఇన్నింగ్స్ ఎంత వేగంగా ఆరంభమైందో అదే రీతిన పతనమైంది. రైజర్స్ పేసర్ల ధాటికి టపటపా వికెట్లు కోల్పోయి కనీసం పూర్తి ఓవర్లు కూడా ఆడలేకపోయింది. రఘువంశీ, రింకూ మాత్రమే ఫర్వాలేదనిపించారు. పేసర్ డేవిడ్ పైన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఆలెన్ 4,4,6,6,4తో 25 పరుగులతో అదుర్స్ అనిపించాడు. కానీ అతడి ఊపును తర్వాతి ఓవర్‌లోనే స్పిన్నర్ హర్ష్ రిటర్న్ క్యాచ్‌తో అడ్డుకున్నాడు. అనంతరం వన్‌డౌన్ బ్యాటర్ రఘువంశీ రెండు సిక్సర్లు బాదడంతో కేకేఆర్ 20 బంతుల్లోనే 50 స్కోరుకు చేరుకుంది. అటు కెప్టెన్ రహానె (8)ను పేసర్ ఉనాద్కట్ దెబ్బతీయగా, గ్రీన్ (2) సమన్వయ లోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. అయినా పవర్‌ప్లేలో 74/3 స్కోరుతో నిలిచింది. ఈ దశలో రఘువంశీ-రింకూ అడపాదడపా బౌండరీలతో 9 ఓవర్లలో స్కోరును వందకు చేర్చారు. 27 బంతుల్లోనే రఘువంశీ రెండో వరుస హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఈ జోడీ క్రీజులో ఉన్నంతసేపు జట్టు విజయం దిశగా సాగింది. కానీ 11వ ఓవర్‌లో రఘువంశీ కూడా రనౌట్ కావడంతో కేకేఆర్ ఇన్నింగ్స్ లయ తప్పింది. నాలుగో వికెట్‌కు ఈ జోడీ 46 పరుగులు సాధించింది. ఇక నితీశ్ వరుస ఓవర్లలో అనుకుల్ (0), రింకూలను పెవిలియన్‌కు చేర్చగా.. పేసర్ ఎషాన్ 15వ ఓవర్‌లో నరైన్ (12), రమణ్‌దీప్ (10)ల పనిబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే చివరి రెండు వికెట్లను పేసర్ ఉనాద్కట్ తీయడంతో కేకేఆర్ కథ ముగిసింది.

### మెరుపు ఆరంభంతో..:

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఆరంభం రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఓపెనర్లు హెడ్, అభిషేక్ విధ్వంసకర బ్యాటింగ్‌తో కేకేఆర్ బౌలర్లను వణికించారు. బంతి పడిం దే ఆలస్యం అన్నట్టుగా ఈ జోడీ బౌండరీల వరద పారించింది. దీంతో తొలి 8 ఓవర్లపాటు ఈడెన్‌లో పరుగుల వర్షం కురిసింది. ఆ తర్వాత పట్టు సాధించిన కేకేఆర్ ప్రత్యర్థిని కాస్త కట్టడి చేయగలిగింది. అయితే క్లాసెన్, నితీశ్ నిలకడైన భాగస్వామ్యంతో జట్టు స్కోరు 220 దాటగలిగింది. మొదట హెడ్ బ్యాట్‌కు పనిచెబుతూ మూడో ఓవర్‌లో 4,6,6,4తో 21 రన్స్ రాబట్టాడు. దీంతో నాలుగో ఓవర్‌ను స్పిన్నర్ నరైన్‌తో వేయించగా తను 3 పరుగులే ఇచ్చి ఆకట్టుకున్నాడు. తర్వాత ఓవర్‌లో బంతిని స్పిన్నర్ వరుణ్‌కు ఇవ్వగా.. అభిషేక్ వీరంగం సృష్టించాడు. 6,6,4,4,4తో 25 రన్స్ సాధించాడు. కానీ ఆరో ఓవర్‌లో హెడ్ వికెట్ పేసర్ కార్తీక్ తీయగా.. తొలి వికెట్‌కు 34 బంతుల్లోనే 82 పరుగుల తుఫాన్ భాగస్వామ్యం ముగిసింది. అటు పవర్‌ప్లేలో రైజర్స్ 84/1 స్కోరుతో అత్యంత పటిష్ఠంగా నిలిచింది. తర్వాత 8 ఓవర్లలోనే 110కి చేరింది. ఈ దశలో 250 రన్స్ కూడా సాధ్యమే అనిపించింది. కానీ తర్వాతి ఓవర్‌లో ఇషాన్, అభిషేక్‌ల వికెట్లు తీసిన పేసర్ ముజరబాని డబుల్ ఝలక్ ఇచ్చాడు. ఆ వెంటనే అనికేత్ (1) వెనుదిరగడంతో రైజర్స్ డిఫెన్స్‌లో



పడింది. దీంతో క్లాసెన్, నితీశ్ జోడీ జట్టును ఆదుకునే ప్రయత్నంలో భారీ షాట్లకు వెళ్లలేదు. సింగిల్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో 25 బంతులపాటు బౌండరీ నమోదు కాలేదు. 18వ ఓవర్‌లో క్లాసెన్ 6, నితీశ్ 4,4లతో 16 రన్స్ రాగా స్కోరు కూడా 200కి చేరింది. పేసర్ వైభవ్ 19వ ఓవర్‌లో నితీశ్, సలీల్ (0)లను వరుస బంతుల్లో అవుట్ చేయగా.. ఐదో వికెట్‌కు 82 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆఖరి ఓవర్‌లో 15 రన్స్ సాధించినా.. క్లాసెన్, శివాంగ్ (4)లను ముజరబాని అవుట్ చేశాడు.

### స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) గ్రీన్ (బి) త్యాగి 46, అభిషేక్ (సి) వరుణ్ (బి) ముజరబాని 48, ఇషాన్ (సి) రింకూ (బి) ముజరబాని 14, క్లాసెన్ (సి) రమణ్‌దీప్ (బి) ముజరబాని 52, అనికేత్ (సి) రింకూ (బి) అనుకుల్ 1, నితీశ్ (సి) వరుణ్ (బి) వైభవ్ 39, సలీల్ (బి) వైభవ్ 0, హర్ష్ (నాటౌట్) 9, శివాంగ్ (సి) రహానె (బి) ముజరబాని 4; ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 226/8. వికెట్ల పతనం: 1-82, 2-111, 3-112, 4-118, 5-200, 6-200, 7-222, 8-226. బౌలింగ్: వైభవ్ 4-0-47-2, ముజరబాని 4-0-41-4, నరైన్ 4-0-39-0, వరుణ్ 2-0-31-0, కార్తీక్ 4-0-48-1, అనుకుల్ 2-0-16-1.

కోల్‌కతా: రహానె (సి) ఎషాన్ (బి) ఉనాద్కట్ 8, ఆలెన్ (సి అండ్ బి) హర్ష్ 28, రఘువంశీ (రనౌట్) 52, గ్రీన్ (రనౌట్) 2, రింకూ (సి) ఉనాద్కట్ (బి) నితీశ్ 35, అనుకుల్ (సి) ఇషాన్ (బి) నితీశ్ 0, రమణ్‌దీప్ (సి) ఉనాద్కట్ (బి) ఎషాన్ 10, నరైన్ (సి) అనికేత్ (బి) ఎషాన్ 12, కార్తీక్ (సి) ఇషాన్ (బి) ఉనాద్కట్ 5, వైభవ్ (నాటౌట్) 1, వరుణ్ (బి) ఉనాద్కట్ 0; ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 16 ఓవర్లలో 161 ఆలౌట్. వికెట్ల పతనం: 1-30, 2-67, 3-74, 4-120, 5-120, 6-139, 7-154, 8-159, 9-161, 10-161. బౌలింగ్: పైన్ 2-0-35-0, హర్ష్ 2-0-17-1, అభిషేక్ 1-0-15-0, ఉనాద్కట్ 3-0-21-3, ఎషాన్ 2-0-14-2, శివాంగ్ 4-0-41-0, నితీశ్ 2-0-17-2.



# 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం

## 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ ఎమోషనల్ పోస్ట్

భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. "మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది. 2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు. అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.

# మైదానంలో వాగ్వాదం

## సోషల్ మీడియాలో క్లారిటీ ఇచ్చిన లక్నో ఓనర్



ఐపీఎల్ 2026 సీజన్‌లో తమ తొలి మ్యాచ్‌లోనే లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఓటమిపాలైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమి చెందడంపై జట్టు యజమాని సంజీవ్ గోయెంకా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఓటమి అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్, హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌తో ఆయన మైదానంలో తీవ్రంగా చర్చిస్తున్న వీడియోలు, ఫొటోలు వైరల్ అయిన నేపథ్యంలో ఆయన చేసిన పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. అనంతరం లక్ష్య ఛేదనలో ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే సునాయాసంగా విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో కెప్టెన్ పంత్‌తో గోయెంకా ఏదో సీరియస్‌గా చర్చిస్తున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీంతో జట్టులో ఏదో జరుగుతోందంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గోయెంకా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ అన్నింటికీ తెరదించారు. "ఇది చాలా సుదీర్ఘమైన సీజన్. అర్థవంతమైన దాన్ని నిర్మించే క్రమంలో ఇలాంటి క్షణాలు సహజం. మా కెప్టెన్, జట్టు బలం పుంజుకోగలరని నాకు పూర్తి విశ్వాసం ఉంది. ఈరోజు మద్దతుగా నిలిచిన మా అభిమానులకు ధన్యవాదాలు. మేం మరింత బలంగా తిరిగి వస్తాం. ఈ సీజన్‌లో లక్నో ప్రస్థానం ఇంకా ముగిసిపోలేదు" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో ఆయన జట్టుకు, కెప్టెన్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు.

# ఐపీఎల్ చరిత్రలో మహ్మద్ షమీ సరికొత్త రికార్డు

## ఎవరికీ సాధ్యం కాని అరుదైన ఘనత!

లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఐపీఎల్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే, షమీ ఈ చారిత్రక ఘనత సాధించిన మ్యాచ్‌లో అతని జట్టు లక్నో ఓటమి పాలైంది. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన సీజన్ తొలి మ్యాచ్‌లో లక్నో 6 వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో లక్నో నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను షమీ ప్రారంభించాడు. తొలి బంతికే ఢిల్లీ ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను ఔట్ చేసి జట్టుకు శుభారంభం అందించాడు. ఐపీఎల్ 18 ఏళ్ల చరిత్రలో ఒక ఇన్నింగ్స్‌లో తొలి బంతికే వికెట్ తీయడం షమీకి ఇది ఐదోసారి. ఈ ఘనత సాధించిన తొలి, ఏకైక బౌలర్‌గా షమీ నిలిచాడు. ఈ జాబితాలో షమీ తర్వాత ఏడుగురు బౌలర్లు ఖతలో మూడుసార్లతో రెండో స్థానంలో ఉన్నారు. వారిలో ప్రవీణ్ కుమార్, ఉమేశ్ యాదవ్, ట్రెంట్ బౌల్ట్, లసిత్ మలింగ, భువనేశ్వర్ కుమార్, అశోక్ దిండా, ప్యాట్ కమ్మిన్స్ ఉన్నారు. అయితే, షమీ అద్భుత ఆరంభాన్ని లక్నో సద్వినియోగం చేసుకోలేకపోయింది. 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన సమీర్ రిజ్వీ అద్భుతంగా రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ సునాయాసంగా విజయం సాధించింది. ఈ గెలుపుతో ఢిల్లీ తమ ఐపీఎల్ 2026 సీజన్‌ను ఘనంగా ప్రారంభించగా, లక్నోకు తొలి మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది.





# తండ్రి వ్యాఖ్యలపై స్పందించిన యువరాజ్ సింగ్.. ధోనీ, కపిల్‌కు సారీ!

భారత క్రికెట్ మాజీ ఆల్-రౌండర్ యువరాజ్ సింగ్, టీమిండియా మాజీ కెప్టెన్లు ఎంఎస్ ధోనీ, కపిల్ దేవ్‌లకు క్షమాపణలు చెప్పాడు. తన తండ్రి, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ గతంలో వారిపై చేసిన తీవ్రమైన, వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో యువీ ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, ఎంఎస్ ధోనీ వంటి దిగ్గజాలున్న జట్టులో యువరాజ్ కీలక ఆటగాడిగా వెలుగొందాడు. ముఖ్యంగా 2007 టీ20, 2011 వన్డే ప్రపంచకప్‌ల విజయాల్లో అతని పాత్ర మరువలేనిది. ఓ స్పోర్ట్స్ టాక్ పాడ్‌కాస్ట్‌కు సంబంధించిన టీజర్‌లో యువరాజ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "నేను కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీలకు క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను" అని అందులో పేర్కొన్నాడు. తన తండ్రి ఇచ్చే ఇంటర్వ్యూల గురించి ప్రస్తావించినప్పుడు, "నాన్నా, అది కరెక్ట్ కాదు అని చెప్పాను" అంటూ యువరాజ్ తెలిపాడు. యువరాజ్ సింగ్‌కు భారత జట్టు కెప్టెన్సీ దక్కకపోవడానికి ధోనీనే కారణమంటూ యోగ్‌రాజ్ సింగ్ చాలా కాలంగా ఆరోపణలు చేస్తూ వస్తున్నాడు. ధోనీ వల్లే తన కుమారుడి కెరీర్ దెబ్బతిన్నదని పలు సందర్భాల్లో బహిరంగంగా విమర్శించాడు. ధోనీ నాయకత్వంలోనే యువరాజ్ తన కెరీర్‌లో అత్యధిక కాలం ఆడినప్పటికీ, యోగ్‌రాజ్ మాత్రం ధోనీపై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నాడు. కేవలం ధోనీపైనే కాకుండా దిగ్గజ ఆల్-రౌండర్ కపిల్ దేవ్‌పైనా యోగ్‌రాజ్ సింగ్ గతంలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. 1980లలో తనను జట్టు నుంచి అకారణంగా తొలగించినందుకు కపిల్ దేవ్‌ను చంపాలనుకున్నానని 2025లో యోగ్‌రాజ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. పిస్టల్ తీసుకుని కపిల్ ఇంటికి వెళ్లానని, కానీ అక్కడ కపిల్ తల్లి ఉండటంతో వెనక్కి వచ్చానని ఆయన చెప్పడం అప్పట్లో పెను ప్రకంపనలు సృష్టించింది. ధోనీ, కపిల్ వంటి ఆటగాళ్లు ఇతరులను చెత్తలా చూశారని కూడా ఆయన ఆరోపించాడు. ఇలాంటి తీవ్రమైన వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే తన తండ్రి తీరుపై యువరాజ్ ఇప్పుడు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది.



## నభా నటేష్ అందాల తుఫాన్..


తెలుగు తెరపై తనదైన ముద్ర వేసిన అందాల భామ నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. బ్లాక్ కలర్ శారీలో తన హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. కొన్ని రోజుల తర్వాత రీ-ఎంట్రీ ఇచ్చిన ఈ 'ఇస్మార్ట్' పిల్లా, వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాకుండా.. గ్లామర్ డోస్ పెంచి అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. అసలు ఆ ఫోటోల విశేషాలేంటో చూద్దాం. నభా నటేష్ అంటేనే ఒక ఎనర్జీ. సినిమాల్లోనే కాదు, సోషల్ మీడియాలో కూడా ఆమె చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ బ్లాక్ కలర్ శారీలో అదిరిపోయే ఫోటోషూట్ చేసింది. తన నడుము ఒంపులు, ఎద అందాలు హైలెట్ అయ్యేలా ఆమె ఇచ్చిన బోల్డ్ స్టిల్స్ చూసి నెటిజన్లు ఫిదా అయి-ఎపోతున్నారు. "బ్లాక్ బ్యూటీ అంటే నీవే నభా" అంటూ కామెంట్స్ సెక్షన్‌ను నింపేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. కన్నడ సోయగం అయిన నభా, 2018లో 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' ఆమె దశను మార్చేసింది. ఆ సినిమాలో తెలంగాణ యాసలో మాట్లాడుతూ, మాస్ లుక్‌లో నభా చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఇక ఆ ఒక్క సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన ఈ బ్యూటీ, వరుసగా క్రేజీ ఆఫర్లను దక్కించుకుని తెలుగు ప్రేక్షకుల ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది. కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉన్న సమయంలోనే నభాకు ఒక చిన్న యాక్సిడెంట్ జరిగింది. దీనివల్ల ఆమె కొంతకాలం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చి బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ గ్యాప్ తర్వాత మళ్ళీ ఫుల్ ఎనర్జీతో రీ-ఎంట్రీ ఇచ్చింది. ఇక ఇటీవల ప్రియదర్శి సరసన 'డార్లింగ్' చిత్రంతో పలకరించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిలబడలేకపోయింది. అయినప్పటికీ నభా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు భారీ ప్రాజెక్టులు ఉండటం విశేషం.

## వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?



దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది. ఎందుకంటే.. శ్రీరాముడి సీన్ షూట్ తర్వాత.. ఇన్ని రోజుల కష్టానికి ఈ ఒక్క షాట్ చాలు.. అని అనిపించిందని స్వయంగా మహేష్ బాబునే ఓసారి చెప్పుకొచ్చాడు. కాబట్టి.. లుక్స్ పరంగానే కాదు, విజువల్ పరంగాను వారణాసి టాప్ నాచ్ అనేలా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.

## ఏడేళ్ల కల సాకారం కాబోతోంది



రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ

బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉ ంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.

## చీరకట్టులో దేవకన్యను తలపిస్తున్న శృతిహాసన్..



అందాల తార.. పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న సెలబ్రిటీ కిడ్ శృతిహాసన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. సింగర్ గా తన ప్రయాణాన్ని ఇండస్ట్రీలో మొదలుపెట్టింది. తన అద్భుతమైన గాత్రంతో శ్రోతలను అలరించిన శృతిహాసన్ ఆ తర్వాత హీరోయిన్ గా అవతరించిన విషయం తెలిసిందే ..ముఖ్యంగా 3 సినిమాతో యువతలో క్రష్ గా మారిన శృతిహాసన్... తెలుగులో తొలిసారి అనగనగా ఓ ధీరుడు సినిమాతో ప్రేక్షకులను పలకరించింది..ఇకపోతే సడన్ గా శృతిహాసన్ పింక్ కలర్ చీర కట్టుకొని అందాలు ఆరబోయడంతో ఆ ఫోటోలు కాస్త సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన అభిమానులు బ్లాక్ సెంటిమెంట్ కి శృతిహాసన్ బ్రేక్ చెప్పిందా అనే కామెంట్లు వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. శృతిహాసన్ ఇంస్టా పేజ్ ను కనుక గమనిస్తే.. ఎక్కువగా ఆమె బ్లాక్ అవుట్ ఫిట్ లోనే దర్శనమిస్తుంది. ఈ బ్లాక్ ధరించడం వల్ల తనకు సెంటిమెంట్ మాత్రమే కాదు.. తనలో సెల్ఫ్ కాన్ఫిడెంట్ పెరుగుతుందని, తన స్కిన్ టొన్ మెరుగుపడుతుంది అని కూడా గతంలో తెలిపింది

## లుక్స్ తో చంపేస్తున్న బాలయ్య బ్యూటీ!



సమయం దొరికితే చాలు వెకేషన్స్ అంటూ ఎంజాయ్ చేస్తున్న హీరోయిన్స్ అటు డే టైం లోనే కాకుండా ఇటు నైట్ టైమ్స్ లో కూడా నగర అందాలను చూస్తూ.. ఆస్వాదిస్తూ గ్లామర్ తో అభిమానులను కూడా అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే బాల్కనీలో పౌర్ణమి వెన్నెలలో చల్లని గాలులకు మరింత హీట్ పుట్టించేలా అందంగా ముస్తాబయి అందరి మనసులు దోచుకుంటోంది ప్రముఖ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్. మెరూన్ రెడ్ కలర్ చీర కట్టి అందాలు ఆరబోస్తూ.. బాల్కనీలో నగర అందాలను ఆస్వాదిస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. పైగా ఈ ఫోటోలకు దేశీ లుక్స్ అంటూ జోడించిన క్యాప్షన్ విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇక ఈ మధ్యకాలంలో ఎక్కువగా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రగ్యా జైస్వాల్ మరొకసారి మేడ మీద నుంచి అందాలు ఆరబోయడంతో అభిమానులు ఈమె అందానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ప్రగ్యా జైస్వాల్ అందం చూసి అభిమానులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా కామెంట్ చేస్తూ ఆమెపై తమ ప్రేమను పంచుకుంటున్నారు. మొత్తానికైతే ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రగ్యా జైస్వాల్ మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జన్మించింది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్ లో చదివింది. అలాగే సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న రోజుల్లోనే వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని విజయవంతమైన మోడల్గా ఎదిగింది. కళా, సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి గానూ 2014 జనవరి 22న సింబయాసిస్ సాంస్కృతిక్ పురస్కారం కూడా లభించింది. 2008లో సెమినా మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ టైటిల్స్ ను సొంతం చేసుకుంది . అంతేకాదు డాబర్ వాటిక , మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, రిలయన్స్ డిజిటల్ ఎక్ష్బిబి వంటి ఎన్నో పాపులర్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా కూడా చేసింది.

# పేదలకు ఉపకారం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

## మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

## కాంగ్రెస్ కి అండగా నిలవండని కోరిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : పేద ప్రజలకు ఉపకారం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పేదలు, మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి సర్కారు కృషి చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నల్లగొండలో జరిగిన గ్రామసభకు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మల్లేశం, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఎస్వో నర్సింగరావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుందని, ఇప్పటికే ఉచిత బస్సు, వడ్డీ లేని రుణాలు, అద్దె బస్సులు, క్యాంటీన్లను అందించినట్లు తెలిపారు. మహిళల పేరుతోనే పథకాలను అందజేస్తున్నామని చెప్పారు. ఓట్లను దండుకునేందుకు కేసీఆర్ రైతులకు చేసింది తక్కువ, చెప్పింది ఎక్కువగా ఉ ఒదని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆనందం కోసం రుణ మాఫీ చేసినట్లు, సబ్సీడీపై ఎరువులు, పనిముట్లు, పరికరాలు ఇచ్చినట్లు తెలిపారు. తరుగు పేరుతో గత ప్రభుత్వం రైతులను దోచుకుందని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు 70వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. గతంలో రేషన్ కార్డు ఇవ్వకపోగా, ఎవరి పేర్లను కలుపలేదని, తాము కొత్త రేషన్ కార్డులను ఇచ్చామని, కొత్తగా పేర్లను నమోదు చేశారని తెలిపారు. రేవంత్ సర్కారు సన్నబియ్యం అందిస్తుందని అన్నారు. ప్రైమరీ నుండి ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్టు, మిడ్ డే మీల్స్ ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అందుకే గ్రామాల్లో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలువాలని ఆయన కోరారు. అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నారులకు యూనిఫాంలను ఎమ్మెల్యే అందించారు. సర్పంచ్ జింక మారుతి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, నాయకులు బండారి రమేష్, గోగూరి నర్సింహారెడ్డి, మోరపెల్లి రమణారెడ్డి, బుదారపు శ్రీనివాస్, దావు సంపత్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**దాచారం సర్పంచ్ భైర మనసా రాజేందర్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని దాచారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక గ్రామసభకు అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ భైర మనసా రాజేందర్ గ్రామ సభలో గ్రామ ప్రజలకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. రానున్న కాలంలో కొత్తగా చేపట్టబోయే సంక్షేమ పథకాలను తెలియజేస్తూ అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దీటి బాల నర్సు, పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది, ఆశ అంగన్వాడి కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివో ఏలు , గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాల ముసుగుల పరిశీలన



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ముసుగులతో ఉన్న మహనీయుల విగ్రహాలను అధికారులు గురువారం సాయంత్రం పరిశీలించారు. కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ మాధురి తిమ్మాపూర్ బస్టాండ్ కు చేరుకొని ఆర్టీసీ స్థలాన్ని పరిశీలించారు. ఆర్టీసీ రికార్డులతో పాటు, మహనీయుల విగ్రహాలను పరిశీలించారు. విగ్రహాలు ఏర్పాటు, ఆవిష్కరణ కాకపోవడానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తి సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కి నివేదిస్తామని అధికారులు తెలిపారు.

# ప్రమాద బాధితులను కాపాడితే సహాయం: ఎస్పీ. బి. గితే

సిరిసిల్ల. ఏప్రిల్ 2. జనతా న్యూస్. రోడ్డు ప్రమాదంలో బాధితులను కాపాడితే తగిన ఆర్థిక సహాయం అందిస్తామని ఎస్పీ బి. గితే తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ప్రమాదం జరిగిన తొలి గంట సమయాన్ని గోల్డెన్ ఆవర్ గా గుర్తిస్తామని ఆ సమయంలో ప్రమాద బాధితులను గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాద బాధితులను కాపాడిన వారికి "రహ్ - వీర్" పథకం ద్వారా 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. 'రాహ్ వీర్ "పథకానికి సంబంధించి జిల్లా పోలీసు శాఖ రూపొందించిన ప్రచార పత్రాలను పత్రికలకు విడుదల చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే108 కి తెలపాలని కోరారు.




# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజా పాలన'

**- గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - తహశీల్దార్ మద్దసాని రమేష్**

**- పథకాల అమలులో అర్హులే లక్ష్యం- సర్పంచ్ జంగా శిరీష**



చిగురుమామిడి,జనత న్యూస్: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చిగురుమామిడి తహశీల్దార్ ముద్దసాని రమేష్ పేర్కొన్నారు. గురువారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో సర్పంచ్ జంగా శిరీష వెంకటరమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మండలంలోని 17 గ్రామాల్లో ఈ సభలు జరుగుతున్నాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి, అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఏళ్ల నాటి తమ సొంతింటి కల నెరవేరుతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్ కుమార్, పెసరి రాజాకృష్ణ, నాంపల్లి శిరీష, పెసరి ప్రమీల, ఎనగందుల రాజేశ్వరి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్లెపెల్లి అభివృద్ధికి సహకరించండి ఎమ్మెల్యే గారు

**గ్రామ సర్పంచ్ బిగ్గుల్ల మోహన్.**

జనత న్యూస్ బెజ్జంకి : మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం బెజ్జంకి పర్యటనకు వచ్చిన సందర్భంగా మండలంలోని కల్లెపెల్లి గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణం, కొత్త అంగన్వాడి సెంటర్ నిర్మాణం కోసం సహకరించాలని వినతి పత్రం సమర్పించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,పర్ష సంతోష్,శానగొండ శరత్ కుమార్, ఒగ్గు కనకయ్య, బుర్ర రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కన్నుల పండగల లక్ష్మీ నరసింహుల శకటోత్సవం





జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో ఏకశిలా గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చైత్ర శుద్ధ పౌర్ణమి గడియలలో శకటోత్సవ ( గుట్ట చుట్టూ బండ్లు తిరుగుట ) కార్యక్రమాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి, శ్రీ లక్ష్మీనరసింహులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బెజ్జంకి గ్రామ ప్రజలతోపాటు, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ట్రాలీలు, బైకులు మొదలైన వాహనాలను అత్యంత సుందరంగా ముస్తాబు చేసి, మామిడి తోరణాలతో వాహనాలను అలంకరించి, లక్ష్మీ నరసింహ స్వామి స్మరణ ఘోషతో , గుట్ట చుట్టూ వాహనాలను తిప్పి ఎంతో వైభవంగా శకటోత్సవ సంబరాలను జరుపుకున్నారు. ఈ శకటోత్సవములో మేకల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ పోలీస్ శాఖ వారి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శకటోత్సవం ప్రశాంత వాతావరణంలో విజయవంతమైందని సంతోషం వ్యక్తం చేశారు.

# బేగంపేటలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక గ్రామసభ సమావేశం గ్రామ సర్పంచ్ ఎల విజయ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ప్రత్యేక అధికారి, మండల పంచాయతీ అధికారి పి. మంజుల హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 కు గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, చేయూత పెన్షన్లు, గృహ జ్యోతి, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులు మొదలకు పథకాలతో పాటు, ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకం మొదలకు సంక్షేమ పథకాలను గ్రామసభలో చదివి ప్రజలకు వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి బి.కృష్ణారెడ్డి, అగ్రికల్చర్ అధికారి పరకాల సాయిచరణ్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక సభ్యులు, వివో ఏలు, గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ పరిజ్ఞానం ప్రాథమిక విద్య నుంచే అవసరం

**వడ్లూర్ సర్పంచ్ పులి రమేష్ గౌడ్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వడ్లూరు ప్రాథమిక పాఠశాలలో , పాఠశాల నిధులతో కొనుగోలు చేసిన కంప్యూటర్ ని గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా విధానంలో ఆన్లైన్ వర్క్, మరియు ఆన్లైన్ రిపోర్ట్స్ ఉన్నతాధికారులకు పంపించడం ఎక్కువ అవుతుందని, దీనికోసం ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లడంతో సమయం వృధా అవుతుందని తెలిపారు. అందుకే కంప్యూటర్ ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాల నుంచే నేటి విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన ఉండాలని సూచించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నాటికి మరిన్ని వసతులతో వడ్లూరు పాఠశాలను ఆదర్శ పాఠశాల గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు: మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, ఏప్రిల్ 02: తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక, బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్యాధికారాన్ని స్థాపించిన గొప్ప యోధుడిగా పాపన్న చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. 17వ శతాబ్దంలో సామాన్య కుటుంబంలో జన్మించి అసాధారణ స్థాయికి ఎదిగిన పాపన్న మొఘల్ పాలకుల దమనకాండను, జమీందారుల అకృత్యాలను ఎదిరించి పీడిత వర్గాలను ఏకం చేసి స్వంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని గుర్తుచేశారు.

వరంగల్ జిల్లా కిలా షాపూర్‌ను రాజధానిగా చేసుకుని బహుజన రాజ్యాన్ని పాలించారని వివరించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలనే లక్ష్యంతో పోరాడిన మహాయోధుడు పాపన్న అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పొన్నం శ్రీనివాస్ గౌడ్, దులం అంజయ్య గౌడ్, జాగిరి సాగర్, ఈశ్వర్ గౌడ్ తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి బైక్ ర్యాలీకి పటిష్ట బందోబస్తు: సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, ఏప్రిల్ 02: హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి, శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ర్యాలీ మార్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర నిఘా ఉంచాలని, వివాదాస్పద పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ అధికారులను ఆదేశించారు. ర్యాలీ కారణంగా ప్రజలకు, అంబులెన్స్ సేవలకు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే కూడళ్ల వద్ద ముందస్తుగా మళ్లింపు చర్యలు చేపట్టాలని, నగరంలో ఎక్కడా ట్రాఫిక్ స్తంభించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండుగ వాతావరణంలో ర్యాలీ ప్రశాంతంగా ముగిసేలా ప్రతి పోలీస్ అధికారి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సీపీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి తదితర పోలీసులు పాల్గొన్నారు.

# జాగృతి ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి: కవిత పిలుపు



హైదరాబాద్/కరీంనగర్, ఏప్రిల్ 02: తెలంగాణ జాగృతి ఆవిర్భావ సభను విజయవంతం చేసి, రాష్ట్రంలో జాగృతిని బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25న జాగృతి రాజకీయ శక్తిగా ఆవిర్భవిస్తున్న నేపథ్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆవిర్భావ సభకు కరీంనగర్ జిల్లా నుండి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాగృతి గత ఇరవై సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారం, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం కృషి చేసిందని, రాబోయే రోజుల్లో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ఎక్కడ సమస్య ఉన్నా అక్కడికి వెళ్లి పోరాడే ధోరణితో ముందుకు సాగాలని జాగృతి నాయకులకు సూచించారు. కరీంనగర్ జిల్లాలో జాగృతి బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వాన్ని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, మహిళలు జాగృతిలో చేరారు. మడిపల్లి వినీత్ కుమార్, ఎండి తాజ్, పూసాల రణధీర్, రాగటి జీవన్, ముప్పా విజయ్, గాజుల నవ్య, కొలగాని మాధవి, కుతాడి రజిత, పల్లె శారదా, అసియా సుల్తానా తదితరులు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం అధ్యక్షుడు ఉదాడు శ్రీనివాస్, బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన చక్రవర్తి పాపన్నగారి పోరాటం స్ఫూర్తిదాయకం



చిగురుమామిడి,జనత న్యూస్: అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.గురువారం చిగురుమామిడి మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బండారుపల్లి చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్, సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ మాట్లాడారు.పాపన్న గౌడ్ కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన గొప్ప యోధుడని వారు కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, పోరాట పటిమ నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్ ఉపసర్పంచ్ కాశ వేణి విజయ వార్డ్ మెంబర్లు శివాంజనేయులు పన్యాల అన్నపూర్ణ రాకం అంజవ్వా బెజ్జంకి రాంబాబు, తాళ్లపల్లి భాస్కర్, బండారుపల్లి సంపత్, గౌడ్ బూరుగు శ్రీకాంత్, గౌడ్ సర్వర్ పాషా కాటం అనిల్ గౌడ్ నోముల పరిశరాములు గౌడ్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ బూర్గు రాజమల్లు గౌడ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు సభలు

**మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, ఏప్రిల్ 02: ప్రజా పాలనను ప్రజల గుమ్మం వద్దకు చేర్చే లక్ష్యంతో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నగరవ్యాప్తంగా వార్డు సభలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సభలో మేయర్ పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. అనంతరం 43వ డివిజన్ గోదాంగడ్డలో జరిగిన సభలో కూడా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డివిజన్ల వారీగా జరిగిన సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పారిశుద్ధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరాలు తెలియజేసి, లబ్ధిదారుల వివరాలను సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్యం, స్ట్రీట్ లైట్లు, త్రాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రతి డివిజన్ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తామని, యువత, మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో వార్డు సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రజల సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# వేదభవన్‌లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా



కరీంనగర్, ఏప్రిల్ 02: కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ బైపాస్ వద్ద ఉన్న వేదభవన్‌లో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వికాస తరంగిణి, ఆధ్యాత్మిక భక్తుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భగవత్ రామానుజాచార్యులకు వేద మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు, పారాయణ పూజలు ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదభవన్‌లో శ్రీ సీతారాములు, భగవత్ రామానుజాచార్యులకు వేద పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేయర్‌ను శాలువాతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక అని తెలిపారు. నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సీతారాములు, హనుమంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. వేదభవన్ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. భక్తుల అభ్యర్థన మేరకు భగవత్ రామానుజాచార్యుల విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తామని, ప్రధాన రహదారి నుంచి వేదభవన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని వెల్లడించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనసుకు ప్రశాంతతను ఇస్తాయని, ఇలాంటి కార్యక్రమాలు సంస్కృతిని కాపాడటంలో కీలకమని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు గౌతంరావు, వేదభవన్ భక్తులు, వేద పండితులు, అర్చక విద్యార్థులు పాల్గొన్నారు.

# సకాలంలో స్పందించిన పోలీసులు.. ఆత్మహత్యాయత్నం భగ్నం

కరీంనగర్, ఏప్రిల్ 02: కరీంనగర్ ఎల్.ఎం.డి డ్యామ్ పరిసరాల్లో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వివాహితను పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన పి. రాణి మనస్తాపానికి గురై ఎల్.ఎం.డి సమీపంలో నిద్రమాత్రలు మింగి మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అనంతరం ఆమె స్వయంగా డయల్ 100 కు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న వెంటనే లేక్ అవుట్ పోస్ట్ ఆర్.ఎస్.ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డ్ శ్రీనివాస్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వెంటనే రక్షించి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com